నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 29 జనవరి 2024 | KARIMNAGAR

# రేపటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ రాజన్న సన్నిధిలో ఏర్పాట్లు



వేములవాడ టౌన్, జనవరి 28: వేములవాడ రాజన్న సన్నిధిలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3 వరకు త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆదివారం వెల్లడించారు. ఇందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని, ఓపెన్‌స్లాబ్‌ను సుందరంగా తీర్చిదిద్దామని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 5.45 గంటలకు స్వస్తి పుణ్యాహవచనంతో ప్రారంభమై 7.25 గంటలకు నగర సంకీర్తన, 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన ఉంటుందని వెల్లడించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో సుప్రసిద్ధ కళాకారులతో శాస్త్రీయ, భక్తి, సంగీత, హరికథ, నృత్య, నాటక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవాల ఇన్‌చార్జి కొంటికర్ల రామయ్య శర్మ తెలిపారు.



# ట్రస్మా జిల్లా, నగర కార్యవర్గాలు ఏకగ్రీవం

నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న శేఖర్ రావు

కమాన్‌చౌరస్తా, జనవరి 28 : ట్రస్మా కరీంనగర్ జిల్లా, నగర కార్యవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ట్రస్మా రాష్ట్ర చీఫ్ అడ్వయిజర్ యాదగిరి శేఖర్ రావు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా డాక్టర్ ఈ ప్రసాద్‌రావు, సౌగాని కొమురయ్య వ్యవహరించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడిగా కోరం సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బుర్రన్నగారి రమణారావు, కోశాధికారిగా రంగు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముసిపట్ల తిరుపతిరెడ్డి ఎన్నికయ్యారు. నగర అధ్యక్షుడిగా రావుల నరేశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మ శ్రీనివాస్ గౌడ్, కోశాధికారిగా బండ శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీగా మహ్మద్ ఖలీద్, ఉపాధ్యక్షుడిగా నటరాజ్ ఎన్నికయ్యారు.

# అన్నగా.. తమ్ముడిగా మీతోనే ఉంటా

- సిరిసిల్లను వదిలి ఎక్కడికీ వెళ్లను
- కంటికి రెప్పలా కాపాడుకుంటా
- అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- నేతన్నల సమస్యలపై గొంతు విప్పుతా
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సిరిసిల్లలో పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- శ్రేణులకు దిశానిర్దేశం

"ఇరవై నాలుగేండ్లు రయ్‌మని ఉరికిన కారుకు సర్వీసింగ్ అవసరం పడదా? తాత్కాలిక బ్రేకర్లు వచ్చాయే తప్ప భూమి ఆకాశం కింద మీదపడ్డట్టు ఆగమాగం కావద్దు. తప్పకుండా మళ్లీ మనమే వస్తం. ప్రజలు మనవద్దకే వస్తరు. రాజకీయాల్లో ఇవి మామూలే. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి కార్యకర్త గట్టిగా పనిచేయాలి."



బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

**నాకు రాజకీయ జన్మనిచ్చిన సిరిసిల్లను వదలి ఎక్కడికీ వెళ్లను. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు మీతోనే ఉంటా.. దయచేసి ఎలాంటి అనుమానం ఉన్నా మనసులో నుంచి తీసేయండి. నేను మంత్రిగా ఉన్నప్పుడు బాధ్యత పెరిగి అక్కడక్కడ తిరిగా. వర్కింగ్ ప్రెసిడెంట్ అయినందున అన్ని నియోజకవర్గాల్లో పర్యటించక తప్పదు. మిమ్మల్ని కంటిరెప్పలా కాపాడుకునే బాధ్యత నాదే" అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ఉద్ఘాటించారు.**

రాజన్న సిరిసిల్ల, జనవరి 28 (నమస్తే తెలంగాణ): ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ వద్ద పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అధ్యక్షతన జరిగిన సిరిసిల్ల నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. స్వల్పతేడాతో 14 నియోజకవర్గాలు పోయాయని, అందులో సగం గెలిచినా హంగ్ అసెంబ్లీ వచ్చేదన్నారు. దీనికి ఆగమాగమయ్యే అవసరం ఎంత మాత్రం లేదని, నిరాశ, నిస్పృహల నుంచి బయటకు రావాలని కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదని కేసీఆర్ చెప్పిన మాటలు నిజమవుతున్నాయని గ్రామాల్లో చాలా మంది రైతులు బాధపడుతున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి సెక్రటేరియట్‌కు వెళ్లి లంకె బిందెలుంటయనుకుని వచ్చానన్నారని, చూస్తే ఖాళీ బిందెలున్నయన్నారని, లంకె బిందెల కోసం గుట్టలు, గడీలల్లకు రాత్రి దొంగలే పోయి తవ్వుతుంటారని ఎద్దేవా చేశారు. మంత్రిగా పనిచేసిన అనుభవం లేని రేవంత్‌రెడ్డి సెక్రటేరియట్‌లో లంకె బిందెలుంటయనుకుంటే పొరపాటని, అక్కడ ఉండేవి కంప్యూటర్లు, పేపర్లు, పనిచేసేందుకు అధికారులుంటారని చురకలంటించారు. అధికారులను కూర్చోబెట్టి ఇచ్చిన హామీలు ఎలా నెరవేర్చాలో ఆలోచన చేయాలని హితవుపలికారు. కేసీఆర్ అప్పుల పాలు చేసిపోయిండని చెప్పి హామీలు ఇవ్వకుండా తప్పించుకు తిరిగేటోళ్లను కంట కనిపెట్టాలని సూచించారు.

## పార్టీ పటిష్టత కోసం పనిచేద్దాం

ఈ ఐదేళ్లు పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని కేటీఆర్ పిలుపు నిచ్చారు. పార్టీని క్షేత్ర స్థాయిలో నిర్మించుకుందామని సూచించారు. పనిచేసే వారికే పదవులిస్తామని స్పష్టం చేశారు. పోయింది అధికారం మాత్రమేనని, పోరాట పటిమతగ్గలేదని, ఎన్నటికీ తగ్గదన్నారు. అధికార ప్రతినిధులను నియమిస్తామని తెలిపారు. కేసీఆర్ తయారు చేసిన సైనికులు వందల మంది ఉన్నారని, ప్రజల పక్షాన రాబోయే ఐదేళ్లు గట్టిగా నిలబడాలని సూచించారు. అధికారం పోయిందన్న బాధతో ప్రజల్ని కించపరిచేలా ఎవరూ మాట్లాడవద్దని కోరారు. ఈ ఏడాదంతా వరుసగా పార్లమెంటు, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలుంటాయని, తన గెలుపు కోసం కష్టపడ్డ పార్టీ శ్రేణుల కోసం తాను కష్టపడుతానని, అన్నిరకాలుగా అండగా ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటానని ధీమానిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే దిశగా డిమాండ్ చేయాలని పిలుపునిచ్చారు. కోటి 57లక్షల మంది ఆడబిడ్డలకు నెలకు రూ.2500 చొప్పున ఇచ్చి తీరాలని, ఏడాదికి 5 లక్షల మందికి ఇస్తామని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేదాకా ప్రభుత్వాన్ని నిలదీసి వెంటపడాలన్నారు. నిరుద్యోగ భృతి, బీసీ, మైనార్టీ సబ్‌ప్లాన్ వంటివి ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటి కూడా వదిలిపెట్టకుండా పుస్తకాన్ని పట్టుకుని ప్రజల వద్దకు పోవాలని చెప్పారు.

**ఇప్పటి వరకు రెండున్నర ఎకరాలకంటే ఎక్కువ ఉన్న రైతులకు రైతుబంధు పడలేదు. నాడు కేసీఆర్ బిచ్చమేసినట్లు వేస్తుండని, రైతుబంధు రూ.15 వేలు ఇస్తమని రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికి ఇప్పటి వరకు ఇవ్వలేదు. కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు ఇవ్వడానికే దిక్కులేదంటే.. రైతు భరోసా చాలు చేసిన అని, పంటకు రూ.7500 ఇస్తున్నానని విదేశీగడ్డపై సీఎం రేవంత్‌రెడ్డి పచ్చిబోగస్ మాటలు మాట్లాడిండు. సాధ్యం కాని హామీలిచ్చి కేసీఆర్‌పై విమర్శలు గుప్పిస్తూ ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నడు. వాటిని తిప్పికొట్టాలి.**

## పార్లమెంటు ఎన్నికల్లో బాగా పనిచేయాలి

కేంద్రంలో ఈ పదేండ్ల కాలంలో ఇద్దరు ఎంపీలు పనిచేశారని, అందులో మొదటి ఐదేండ్లు వినోద్‌కుమార్, తర్వాత బండి సంజయ్ ఉన్నారని, వీరిద్దరిలో ఎవరు ఎంత చేశారో బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. వినోద్‌కుమార్ పార్లమెంట్‌లో 110 చర్చల్లో పాల్గొని తెలంగాణ, కరీంనగర్ ప్రజల పక్షాన 550 ప్రశ్నలతో గొంతు విప్పి బలంగా కేంద్రాన్ని నిలదీసిన విషయాన్ని గుర్తు చేశారు. పది ప్రైవేట్ బిల్లులు పెట్టినట్లు తెలిపారు. అదే బండి సంజయ్ ఐదేండ్లలో ఒక్క చర్చలో కూడా పాల్గొనలేదన్నారు. బండి కేవలం 50 ప్రశ్నలు మాత్రమే అడిగినట్లు చెప్పారు. ఆయన బిల్లులు పెట్టింది గుండు సున్నా అన్నారు. బండి తన మొఖం చూపెట్టని గ్రామాలెన్నో ఉన్నాయన్నారు. ఏదైనా మంచి పని చేసిండా? అని ప్రశ్నించారు. వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంటలో రాములవారున్నా నయాపైసా తెచ్చాడా? అని నిలదీశారు. ప్రధాని మోదీ వద్ద గింత పతార ఉన్నా జిల్లాకు ఏం తెచ్చారని ప్రశ్నించాడు. కొత్త జిల్లాలకు నవోదయ పాఠశాలలు ఒక్కటి కూడా తేలేదని విమర్శించారు. 2006లో పార్లమెంటు సభ్యుడిగా ఉన్న కేసీఆర్ నాడు కొత్తపల్లి – మనోహరాబాద్ రైలు మంజూరు చేయించారని గుర్తు చేశారు. వినోద్‌కుమార్ కృషితో 18 ఏండ్లలో రైలు సిద్దిపేట దాకా వచ్చిందన్నారు. కానీ, ఎంపీ బండి సంజయ్ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, గూడూరి ప్రవీణ్, గుడ్ల మంజుల, దరువు ఎల్లన్న, బొల్లి రామ్మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, వేదికపై ఎమ్మెల్యే కేటీఆర్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి, జడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు న్యాలకొండ అరుణ, జిందం కళ, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, నాయకులు

## నేతన్నలకు అండగా ఉంటా

''కేటీఆర్‌కు ఓటేశారని నేతన్నలను కాంగ్రెసోళ్లు బెదిరిస్తే ఊరుకునేది లేదు. నేను నేతన్నలకు మాట ఇస్తున్నా. 39 మంది ఎమ్మెల్యేలతో రాష్ట్ర ప్రభుత్వాన్ని దిగ్బంధించి, నిర్బంధించి సవాల్ చేస్తాం. ప్రతి నేతన్నను కాపాడుకుంటాం. మీరెవ్వరికీ భయపడాల్సిన అవసరం లేదు. ఆర్డర్లు వచ్చేలా కృషి చేస్తా. కొత్తగా ప్రభుత్వంలోకి వచ్చినంత మాత్రాన జాగీర్‌దార్లం, రాజులం అంటూ పగబట్టి బెదిరిస్తే బెదిరిపోయేది లేదు. చెరువులు నిండినంక కప్పలు మస్తు గొస్తయి. కాంగ్రెసోళ్ల ప్రలోభాలకు, బీజేపోళ్ల భయాలకో బెదిరిపోకండి. భయపడకండి. ఎవ రూ లేని నాడే తెలంగాణ తెచ్చింది గులాబీ జెండా అన్నమాట మరిచి పోవద్దు. పెద్దపెద్ద సిపాయిలను తట్టుకునే రాష్ట్రాన్ని తీసుకొచ్చినం. ఒక్క నాయకుడు పోతే పది మంది కొత్త అద్భుత నాయకులను తయారు చేసుకుందాం. ఆ బాధ్యత నాదే''.

## సైనికుల్లా పనిచేయాలి



వచ్చే ఎంపీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి. పార్టీ సూచించిన విధంగా మనందరం ముందుకు వెళ్దాం. అసెంబ్లీ ఎన్నికల్లో రామన్న విజయం కోసం ఎవరికి వారు చాలా కష్టపడి పని చేశారు. వారందరికీ అభినందనలు. వచ్చే ఎన్నికల్లో అలాగే పనిచేయాలి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధిగమించి విజయఢంకా మోగించాలి. ప్రస్తుత పరిస్థితి కారుకు ఒక స్పీడ్ బ్రేకర్ లాంటిది. త్వరలోనే కారు వేగం పెరిగి టాప్‌గేర్‌లో దూసుకెళ్తుంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీల కుట్రలు తిప్పికొట్టేలా కార్యకర్తలు కార్యోన్ముఖులు కావాలి. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

**- తోట ఆగయ్య, బీఆర్‌ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు**

## హామీలు అమలయ్యేదాకా పోరాడుదాం

సాధ్యం కాని హామీలిచ్చి సామాన్య ప్రజల్ని మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ హామీలన్నీ అమలు చేసేదాకా పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రజల్ని చైతన్య పరచాలి. తెలివైన ప్రతిపక్షం అధికార పార్టీకన్నా గట్టిగా ఉంటుంది. అతి త్వరలో మన పార్టీ కార్యాలయం వద్దకే ప్రజలు వస్తారు. మనకు చాలా పనులుంటాయి. కాంగ్రెస్ నాయకుల పనితీరు ప్రజలందరికీ బాగా తెలుసు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకుల తీరుపై, పోలీస్‌స్టేషన్లలో అరాచకాలపై ఎదిరించి మాట్లాడాలి. కేటీఆర్‌తోపాటు నేను 24 గంటలు మీ వెంట ఉంటా. నేను ఎంపీగా ఉన్నప్పుడు రెండు జాతీయ రహదారులు మంజూరు చేయించా. సిరోంచ, భూపాలపల్లి, హుస్నాబాద్, మెదక్, నాందేడ్ వరకు జాతీయ రహదారి తెచ్చా. కొత్తపల్లి–మనోహరాబాద్ రైలు మార్గం మంజూరికి బీజేపీ అనేక కొర్రీలు పెట్టింది. భూ సేకరణతోపాటు అయిదేళ్ల పాటు వచ్చే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని చెప్పింది. రైల్వే లైను మంజూరు ఎలా అయిందన్న విషయం ప్రస్తుత ఎంపీకి ఏం తెలుసు?. సిద్దిపేటకు రైలు వచ్చింది. జిల్లాకు రైలు వచ్చేందుకు బండి ఏం చేశారు?.

**- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్**

# మళ్లీ ఎన్నికల బదిలీలు

- ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ఎన్నికల సంఘం
- ఆ మేరకు వివరాలను పంపించిన జిల్లాల యంత్రాంగం
- అతి కొద్దిరోజుల్లోనే ట్రాన్స్‌ఫర్ల పర్వం
- ఉమ్మడి జిల్లాలో 300 మంది బదిలీ అయ్యే అవకాశం
- పంచాయతీరాజ్ శాఖలో ఎక్కువ మందికి స్థానచలనం



**మళ్లీ ఎన్నికల బదిలీల పర్వం మొదలు కాబోతున్నది. ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో భారీగా ట్రాన్స్‌ఫర్లు జరిగిన విషయం తెలిసిందే. కాగా, ఇప్పుడు లోకసభ ఎన్నికల నేపథ్యంలో కసరత్తు ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో రాష్ట్ర ప్రభుత్వ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (జీఏడీ) ఇప్పటికే కలెక్టర్లకు ఆదేశాలు ఇవ్వగా.. ఆ మేరకు జిల్లాల వారీగా యంత్రాంగం జాబితాను సిద్ధం చేసి పంపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 300 మంది అధికారులకు కొద్ది రోజుల్లోనే స్థానచలనం ఉండే అవకాశమున్నది.**

కరీంనగర్, జనవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గత లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం 2019 మార్చి 10న షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆ మేరకు ఏప్రిల్ 11న ప్రారంభమైన ఎన్నికలు ఏడు దశల్లో కొనసాగి, 2019 మే 19 వరకు జరిగాయి. 2019 మే 23న దేశవ్యాప్తంగా ఒకేసారి ఫలితాల లెక్కింపు జరిగింది. అప్పుడు మన రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ఒకేసారి మొదటి దశలోనే జరిగాయి. ఈసారి కూడా అలానే జరుగుతాయనే ప్రచారం జోరందుకున్నది. గతంలో కంటే మరింత ముందుగా అంటే.. వచ్చే మార్చి లేదా ఏప్రిల్‌లో లోకసభ ఎన్నికలు జరిగే అవకాశం కనిపిస్తున్నది. అందుకనుగుణంగానే కేంద్ర ఎన్నికల కమిషన్ అడుగులు వేస్తున్నది. ఇప్పటికే ఓటర్ జాబితా సవరణ ప్రక్రియ చేపట్టింది. జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటించాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ప్రతి 1500 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు జిల్లాల వారీగా అధికారులు ఇప్పటికే రంగంలోకి దిగారు. తుది ఓటరు జాబితా ప్రకటన అనంతరం ఏ క్షణంలోనైనా షెడ్యూల్ విడుదలయ్యే అవకాశముండగా, ఎన్నికలకు పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలను దృష్టి ఉంచుకొని ఎలాంటి పొరపాట్లూ జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### అతి త్వరలోనే ట్రాన్స్‌ఫర్లు

ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీగానే ఉద్యోగుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. కాగా, ఈసారి జరిగే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మళ్లీ బదిలీలు జరగనున్నాయి. వచ్చే జూన్ 30 నాటికి సొంత జిల్లాలో మూడేళ్లకుపైగా విధులు నిర్వర్తించిన అధికారులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అందుకు అనుగుణంగా జాబితాను సిద్ధం చేసి పంపించాలని రాష్ట్ర ప్రభుత్వ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ కలెక్టర్లను ఆదేశించింది. ఈనెల 16లోగా వివరాలు పంపించాలని జీఏడీ స్పష్టం చేసింది. అయి తే, వివిధ కారణాలతో జీఏడీకి ఈ నెల 20 వరకు వివిధ జిల్లాల నుంచి వివరాలు వెళ్లాయి. సదరు కేంద్ర నిబంధనల ప్రకారం చూస్తే.. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 300 మంది ఉద్యోగులు బదిలీ కావొచ్చని అధికారవర్గాల ద్వారా సమాచారం అందుతున్నది. అయితే, ఈసారి పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఎక్కువగా బదిలీలు ఉండే అవకాశముందని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ శాఖ నుంచి తక్కువగా బదిలీలు జరిగాయని, ఇప్పుడు సేకరించిన వివరాల ప్రకా రం చూస్తే సొంత జిల్లాల్లో మూడేళ్లు పూర్తి చేసుకున్న వారిలో ఎక్కువగా పంచాయతీరాజ్ శాఖలోనే ఉన్నారని చెబుతున్నారు. మొత్తంగా బదిలీలకు జాబితా పూర్తిస్థాయిలో సిద్ధమైంది. కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు రావడమే తరువాయి.. వెనువెంటనే బదిలీల పర్వం మొదలు కానున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ వారంలోనే ట్రాన్స్‌ఫర్లు ఉండొచ్చని తెలుస్తున్నది. దీంతో అధికారుల్లో హైరానా మొదలైంది. ఈ బదిలీల్లో ఏ జిల్లాకు వెళ్లాల్సి వస్తుందోనన్న ఉత్కంఠ నెలకొన్నది.

# ఆలయ టస్ట్ బోర్డుల ఏర్పాటుకు నోటిఫికేషన్

కమాన్‌చౌరస్తా, జనవరి 28 : కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలోని 36 ఆలయాల ట్రస్ట్ బోర్డుల ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వీ అనిల్ కుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో భాగంగా, ఆయా ఆలయాల్లో అభ్యర్థులు 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, దేవాదాయ శాఖ నుంచి పోలీస్ వెరిఫికేషన్‌కు పంపిస్తారు. ఆ తర్వాత ఎంపికైన అభ్యర్థులను నోటీస్ బోర్డులో ఉంచి అందులో నుంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు డైరెక్టర్లను ఎన్నుకుంటారు.



డిపో–2లో కారుణ్యనియమాల పత్రాల పంపిణీ కార్యాక్రమంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# ఆర్టీసీలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తాం

- కొత్త బస్సులు కొనుగోలు చేస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

తెలంగాణచౌక్, జనవరి 28 : ఆర్టీసీలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. మహిళలకు ఫ్రీ జర్నీతో బస్సుల్లో రద్దీ పెరిగినందున ఇప్పటికే వెయ్యి కొత్త బస్సులు అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలోనే మరిన్ని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కరీంనగర్ ఆర్టీసీ డిపో–2 ఆవరణలో ఆదివారం కారుణ్య పద్ధతిలో నియామకమైన వారికి ఉద్యోగ పత్రాలు అందజేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మహాలక్ష్మి స్కీంతో బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ ఓపికతో విధులు నిర్వర్తిస్తున్న కండక్టర్లు, డ్రైవర్లను అభినందించారు. ఆర్టీసీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి సర్కారు కట్టుబడి ఉన్నదని, త్వరలోనే సిబ్బందికి శుభవార్త చెబుతామన్నారు. ఇబ్బందుల్లో ఉన్న కార్పొరేషన్‌కు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నిజామాబాద్, ఖమ్మం రీజియన్ పరిధిలో 45 మందికి కారుణ్యనియమాక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సుచరిత, డిప్యూటీ ఆర్ఎంలు భూపతిరెడ్డి, సత్యనారాయణ, డీఎంలు మల్లేశం, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిని పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు



పెద్దపల్లి: కలెక్టరేట్‌లో మ్యూజియంను ప్రారంభిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పక్కన ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్

పెద్దపల్లి, జనవరి28: జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మ్యూజియం, గ్రంథాలయాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. మ్యూజియంలోని రామగిరి ఖిల్లా, గౌరిగుండాల (సబ్బితం) జలపాతం, పాత రాతి యుగపు పనిముట్లు, నాణేలు, మందల ఏళ్లనాటి వృక్ష శిలాజాలు తదితర అంశాలపై ఆర్కియాలజిస్టు శివనాగిరెడ్డి మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యాటకరంగ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. కాగా, మ్యూజియం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపిన కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను మంత్రి అభినందించారు. కార్యక్రమంలో రామగుండం సీపీ రేమారాజేశ్వరి, అదనపు కలెక్టర్లు జే అరుణ శ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, సీనియర్ ఫొటో గ్రాఫర్ రవీందర్ పాల్గొన్నారు.